# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ బీచ్‌లను తీర్చిదిద్దనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**
2. **చిత్తూరు జిల్లా కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తున్నారు.**
3. **తెలంగాణ శాసన సభ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభంకానున్నాయి.**
4. **భారత్ ప్రపంచ పెట్టుబడిదారులకు ముఖ్య గమ్యస్థానంగా మారిందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.**
5. **కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పుల వలన కలిగే ఆదాయ నష్టానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు.**

==========================

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా ఆంధ్రప్రదేశ్ బీచ్‌లను తీర్చిదిద్దనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నం ఆర్కే బీచ్ నుంచి తొట్ల కొండ వరకూ బీచ్ రోడ్‌లో ప్రయాణానికి అనుకూలంగా ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ బస్సులను ముఖ్యమంత్రి గత సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆసియా టెక్నాలజీ హబ్‌గా, రాష్ట్ర ఆర్థిక రాజధానిగా విశాఖ మారుతోందన్నారు. విశాఖలో త్వరలో డేటా సెంటర్, సీ కేబుల్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

చిత్తూరు జిల్లా కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం నిన్న సాయంత్రం కుప్పం చేరుకున్నారు. తరువాత శాంతిపురం తన నివాసానికి చేరుకొని జిల్లాలో తెలుగుదేశం పార్టీ వ్యవహారాలపై ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం అయ్యారు. పర్యటనలో భాగంగా ఈ రోజు పరమసముద్రం చెరువు వద్ద హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాలకు జలహారతి ఇవ్వనున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

---------------------------

తెలంగాణ శాసన సభ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సమావేశంలో కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ అందించిన నివేదికను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ప్రక్రియపై చర్చించే అవకాశం ఉందని తెలిపారు. కాగా తొలి రోజైన ఈ రోజు శాసనసభ ప్రారంభం కాగానే దివంగత శాసన సభ్యులు మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించి.. సభను వాయిదా వేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. సమావేశాలు ఎన్ని రోజులు కొనసాగాలనే అంశాన్ని సభా వ్యవహారాల సంఘం ఈరోజు సమావేశమై నిర్ణయించనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అగ్నిమాపక నిరభ్యంతర పత్రాల –ఎన్ఓసీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేశామని హోంశాఖ మంత్రి వి అనిత తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నంలో www.fireservices. ap.gov.in పోర్టల్‌ను మంత్రి నిన్న ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాత్కాలిక, ఆక్యుపెన్సీ, పునరుద్ధరణ ఎన్ఓసీల కోసం సంబంధిత కార్యాలయాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా పోర్టల్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేసుకోవచ్చని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం–1999కు అనుగుణంగా ఎన్ఓసీ జారీచేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

భారత్ ప్రపంచ పెట్టుబడిదారులకు ముఖ్య గమ్యస్థానంగా మారిందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. కేంద్ర పౌర విమానయాన సంస్థ, భారత పరిశ్రమల సమాఖ్య –సీఐఐ, సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ –ఎస్ఐడీఎం సంయుక్త ఆధ్వర్యంలో గత సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన 'ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్' సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, పోటీతత్వం, సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జాతీయ తయారీ మిషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి 40 నుంచి 50 రోజులకు దేశంలో ఒక కొత్త విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. 2047 నాటికి దేశంలో 350కి పైగా విమానాశ్రయాలుంటాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను–జీఎస్టీ మార్పులతో కలిగే ఆదాయ నష్టానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఢిల్లీలో జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్షపాలిత రాష్ట్రాల ఆర్థికమంత్రులు సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఝార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ ఆర్థికమంత్రులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తమ ప్రతిపాదన సమర్పించనున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి వివరిస్తూ,

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్

కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ –ఆర్‌పీసీసీ సమావేశం తీర్మానించింది. తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అధ్యక్షతన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ పోలీసు ఆర్‌పీసీసీ నిన్న సమావేశమైంది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు, వాటి అక్రమ రవాణా, దర్యాప్తులో అత్యాధునిక సాంకేతికత వినియోగం, ఫోరెన్సిక్ సామర్థ్యాల పెంపు, తీరప్రాంతాల్లో రక్షణ సంబంధిత మౌలిక వసతుల బలోపేతం తదితర అంశాలపై చర్చించింది. పోలీసు శాఖ పరంగా ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించి పలు తీర్మానాలు చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం కోసం త్వరలో స్మార్ట్ కార్డులు ప్రవేశపెడతామని రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విశాఖపట్నంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, స్త్రీశక్తి పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు ఆరు నెలల్లో కొత్త బస్సులు అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏసీ బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలోని దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ...

వాయిస్..25 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================